

# కళ్ళజోడు

హరిమొళ్ళ నరసింహశర్మ

“చూడు బాబూ ఈ కళ్ళజోడు కాలు కొంచెం బాగుపడుతుందేమో” అంటూ ఓ పాత కళ్ళజోడు బల్లమీద పెట్టేరు ఆచార్లుగారు. అప్పటికే దానికి ఓ కాలుకి బదులు దారం కట్టి వుంది. రెండో కాలు వేలబడి వుంది.

ఇటూ అటూ తిప్పి చూసి ఆ కళ్ళజోడు బల్లమీద పెడుతూ “లాభం లేదండి, పూర్తిగా పాడయిపోయింది, రిపేరు కుదరదు” అన్నాడా కుర్రాడు.

“అయితే రిపేరు లాభంలేదంటావు?” తిరిగి ప్రశ్నించేరు. గొంతులోంచి బాధగా వచ్చేయా మాటలు ఆచారిగారికి. కారణం ఇప్పుడా కళ్ళజోడు తన వయస్సుకి, పరిస్థితికి ఎంతో అవసరం కాని తన ఆర్థిక పరిస్తితి దానిలోని అద్దం లాగే పగిలిపోయి వుంది.

“చెప్పేను కదండి! అవతల పారెయ్యడమే తప్ప ఇంకెందుకూ పనిచెయ్యదది” విసుగ్గా రెట్టించి అన్నాడా కుర్రాడు.

“కొత్త ఫ్రేము ఎంతవుతుంది బాబూ! బాగా చవకలో!” అన్నాడు ఎంతో బలహీనంగా.

“ఎనిమిది రూపాయలు” లేచి నిలబడుతూ అన్నాడా కుర్రాడు ఓ ఫ్రేము కొనకపోతారా అని.

“అంత కంటె చవకలో వుండవా బాబూ!” అన్నారు పాత కళ్ళజోడు తీసుకుంటూ.

“అంతకంటె చవకలో కావాలంటే బస్సుస్టాండు దగ్గర రోడ్డు పక్క దుకాణంలో చూడండి. అలాంటివి మా దగ్గరుండవు” అన్నాడు.

“చూడుబాబూ! అందరూ వున్నవాళ్ళే రారు మీదుకాణానికి. అంచేత విసుక్కోకు నాయనా! ఏదో అవసరం వున్నవాడిని కాని ఆర్థికంగా లేనివాడిని కాబట్టి నిన్ను విసిగించి వుంటాను. కాకపోయినా వయస్సులో పెద్దవాడిని కదా నీకంటే. చూడు చిన్న కుర్రాడివి, వుడుకు రక్తంతో పాటు వుపకార బుద్ధి కూడా అలవాటు చేసుకో!” అంటూ బయలుదేరేరు.

అప్పటివరకూ వెనక బల్లమీద ఏదో పనిచేస్తున్న యువకుడు వెనక్కి తిరిగి చూసి "చూడండి" అన్నాడు.

ఆచార్లుగారాగి వెనక్కి చూసి "నన్నా బాబూ?" అన్నారు.

"అవును మిమ్మల్నే" అంటూ బల్ల తప్పించుకు వచ్చిన యువకుడు ఆయన చెయ్యిపట్టుకుని లోపలకి తీసుకువచ్చి తను కూర్చునే కుర్చీలో కూర్చోబెట్టి టేబిల్ ఫాన్ ఆన్‌చేసాడు.

అతని చర్యకి ఆశ్చర్యపోయేడు అంతవరకూ ఆయనతో మాట్లాడిన కొట్లో కుర్రాడు. కాని అంతకంటె ఎక్కువగా ఆశ్చర్యపోయేడు ఆచారిగారు ఆ యువకుడెవరో అర్థం కాక.

కుర్రాడిని ఓ కప్పు కాఫీ తెమ్మని పంపించేడు.

"ఏంటి మేష్టరుగారు! నన్ను గుర్తుపట్టలేదా మీరింకా?" అన్నాడు చిన్నగా ఆయన కెదురుగుండా నిలబడుతూ.

కళ్ళజోడు పెట్టుకుందికి ప్రయత్నిస్తూ అది నిలబడకపోతే కళ్ళదగ్గరగా పెట్టుకుని పట్టుకుని చూస్తూ "లేదు బాబూ!" అన్నారు.

"ప్రయత్నించండి! మీరు గుర్తుపట్టలేకపోతే నన్ను కన్నతల్లి కూడా గుర్తుపట్టలేదు తెల్సా మేష్టారూ!" అన్నాడు.

గొంతు ఎక్కడో పరిచయమున్నట్టుంది, కాని ఎక్కడ? ఎక్కడ? అంటూ మనస్సు ఘోషించింది. ఆ అభిమానానికి కరిగిపోయిన ఆచారి మేష్టారు ఎవరయి వుంటాడు చెప్మా అనుకుంటూ వుంటే—

"ఆ కళ్ళజోడిలా ఇవ్వండిమేష్టారూ!" అన్నాడు ఆ యువకుడు.

"జాగ్రత్త బాబూ! ఒకద్దం పగిలింది, రెండోది కదిలిపోయింది"అంటూ అందించేరు. కాని ఆలోచిస్తున్నారు ఎవరా కుర్రాడని.

"కాఫీ ఆయన కియ్యి" అన్నాడు కాఫీ తెచ్చిన కుర్రాడితో.

"తీసుకోండి మేష్టారూ!" అన్నాడు ఆయన కళ్ళజోడు సెట్‌చేస్తూ.

రెండు గుక్కలు కాఫీ త్రాగేసరికి "మేష్టారూ మరి నా వాటా కాఫీ" అన్నాడా కుర్రాడు ఆయన వేపు తిరిగి.

"అరె! అంతా నాకే అనుకుని ఎంగిలి చేసేశాను బాబూ" అన్నాడు ఎంతో బాధపడుతూ...."అఁ? అఁ! ఒరేయి నువ్వు 'అక్తర్‌సాయిబువి కదురా' అన్నాడు ఆనందం, ఆశ్చర్యం మేళవించిన కంఠంతో.

"అవును మేష్టారూ మీ సాయిబునే నాకు తెల్సును మీరు నన్ను మర్చిపోలేరని."

"నిన్నెలా మర్చిపోతాన్రా! బాగున్నావురా! పెళ్ళదీ అయిందా?"

"అయింది మేష్టారూ! ఒకొడుకు కూడా. అవును మీరెలా వచ్చేరు ఈ వూరు? మీ గురించి మనూరు వెళ్ళేను

కాని ఎవరూ చెప్పలేకపోయేరు మీ రెక్కడుందీ."

"ఏం చెయ్యమంటావురా! అప్పుడే ఏడాది దాటింది నేనీ వూరు వచ్చి."

"ఏడాది దాటిందా మేష్టారూ! ఎక్కడుంటున్నారు? మీ వాసు ఎక్కడుంటున్నాడు?"

"వాసు వాళ్ళావిడ ఇంట్లో వుంటున్నాడు. ఇద్దరు పిల్లలు. వైజాగులో వుంటున్నాడు."

"మరిక్కడ ఎవరున్నారు? మీరెవరి దగ్గర వుంటున్నారు?"

"ఎవరున్నార్రా నాకు?.... అలా ఎందుకనుకోవాల్రా అందరూ నావాళ్ళే కదురా! ఇవన్నీ ఎందుకురా! నా మనస్సెంతో హాయిగా వుంది ఇవేళ నిన్ను కల్సుకున్నందుకు." అంటూ అచేతనంగా వచ్చిన కన్నీళ్ళని పైమీది కండువాతో అద్దుకున్నారు.

ఓ అరగంట గడిచింది.

"ఇదిగో మేష్టారూ! మీ కళ్ళజోడు చూడండి సరిపోయిందో లేదో లేకపోతే సరిచేస్తాను" అన్నాడు ఆయన కళ్ళకి పెట్టి చూస్తూ.

"బాగుండకేం చేస్తుందిరా సాయిబూ! అయినా ఇంత ఖరీదయింది ఎందుకు వేసేవురా? నా దగ్గరున్నది రెండుం పావలా. అందులో ఎంత వస్తే అంతా పాత ప్రేమునే రిపేరు చేసేరా సాయిబూ!" అన్నారు ఆప్యాయంగా అతని భుజం తడుతూ ఆచారిగారు.

"మాష్టారూ! అంత మాటనకండి. రండి మా ఇంటికి వెళదాం. మీ చల్లటి చేతుల్తో నా కొడుకుని దీవించాలి" అంటూ ఆయన రెండు చేతులూ పట్టుకున్నాడు.

"పదరా! అదెంత మాట!" అంటూ లేచేరు.

కొట్టు కుర్రాడికి అప్పజెప్పి "ఇప్పుడే వస్తాను" అంటూ "పదండి మేష్టారూ" అంటూ రిక్షా పిలిచేడు.

ఇంటి దగ్గర రిక్షా ఆగింది. ఇంట్లోకి వెళ్ళి భార్యని పిల్చుకు వచ్చేడు.

"చూడు జరీనా! మా మేష్టారు వచ్చేరు. నీకు చెబుతూవుంతూనే ఆచారి మేష్టారని ఆయనే. అనుకోకుండా ఈ వేళ మన షాపుకే వచ్చేరు.

జరీనా నమస్కరించింది. నిర్మలమయిన నిండుమనస్సుతో ఆశీర్వదించేరు ఆచారి మేష్టారు.

"చూడమ్మా! వీడు నాకు చిన్నప్పటి నుంచి తెల్సును. వీళ్ళ నాన్న, నేను ప్రాణస్నేహితులం. వాడి పోలిక ఒక్కటీ రాలేదు వీడికి. అంతా దూకుడు బుద్ధి. ఇంకా అలాగేవున్నాడా?" అన్నారు ఏదో గతంలోకి చూస్తూ.

చిన్నగా నవ్వుకుంది జరీనా. తన సాయిబు రిపేరుచేసిన కళ్ళజోడులోంచి ఆమెను చూసి సంబరపడిపోయేరు ఆచారిగారు.

"ఒరేయ్ సాయిబూ! నీ కొడుకు అచ్చం మీ నాన్నలాగే వున్నాడ్రా. ఆ

కళ్ళూ, చెవులూ అవీని" అన్నారు జరీనా చేతిలోంచి పిల్లాడిని అందుకుని ఒళ్ళో పడుకోబెట్టుకుంటూ.

జరీనా లోపలకి వెళ్ళి ప్లేట్లో స్వీట్సు పెట్టి పట్టుకొచ్చి బల్లమీదుంచింది.

"నా కెందుకమ్మా ఇవన్నీ?" అన్నారు ఆచారిగారు.

"మొదటిసారి మా యింటికి వచ్చేరు బాబా! మీరు మా సంతోషంకోసం తీసుకోవాలి," అంది జరీనా.

"తప్పకుండాను" అంటూ ఓ స్వీటుతీసి "ఇందరాసాయిబూ" అంటూ అందించేరు అక్తర్‌కి.

"ఏంపేర్రా మీ అబ్బాయిది?" అంటూ ఆయనో స్వీటు తీసుకున్నారు.

"కరీమ్ అని పెట్టుకున్నాం" అన్నాడు.

"చూశేరా బాబా! మీరుకూడా మీ అబ్బాయి పక్షమే అయిపోయేరు, మరి నాకు స్వీటివ్వకుండా ఆయన కొక్కరికే ఇచ్చేరు" అంది జరీనా నవ్వుతూ.

"అవునమ్మా నాది పొరపాటే అయినా నాకు సాయిబొకటే, నువ్వొకటి కాదమ్మా" అంటూ ఓ స్వీటుతీసి ఆమె కిచ్చాడు.

అక్తర్ మనస్సు ఆనందంతో నిండి పోయింది. కళ్ళు రెండూ కృతజ్ఞతా భావంతో మెరిసిపోయేయి ఆచారిగారిని చూస్తూంటే.

"తీసుకోమ్మా వాటిని. మరి నే వెళ్ళి వస్తాను." అన్నారు. దాబుని తీసుకుంటూ "వీలున్నప్పుడల్లా వస్తూవుండండి బాబా!" అంది.

"అభిమానించే మనుష్యుల మధ్య వుండడంకంటే ఈ వయస్సులో మేం కోరుకునే దేముంటుంది తల్లీ! దానికి నోచుకోలేదు నేను!" అన్నారు. ఆయన చివరి మాటల్లో ధ్వనించిన ఆవేదన వారి ద్దరి మనస్సుల్నీ కలతపరిచింది.

"అసలు నేనడిగిన ప్రశ్నకు జవాబు చెప్పనేలేదు మాష్టారూ. మీ రెక్కడుం టున్నారు?" అన్నాడు అక్తర్.

"ఎక్కడుంటే ఏంరా! నువ్వుం టున్న వూళ్ళోనే వుంటున్నాను కదా, ఇప్పుడు నీ యిల్లు అవీకూడా తెలిసేయి కాబట్టి వీలున్నప్పుడల్లా వస్తూవుంటాను." అన్నారు.

"అంటే మేం మీ దగ్గరికి రాకూడదా మాష్టారూ?" అక్తరేసిన ఎదురుప్రశ్నకి ఆయన కళ్ళల్లో నీళ్ళు చివ్వున చిమ్మేయి.

"అదేంలేదురా పిచ్చినాగన్నా! చూడు ఇంకా కాలూ, చెయ్యీ ఆడుతున్నాయి. అంచేత హాయిగా పొద్దున్నేలేచి స్నానం చేసుకుని మన గుడిపక్క పోస్టాఫీసు లేదూ, అక్కడకొచ్చి కూర్చుంటాను. మన దేశంలో నిరక్షరాస్యులు ఎక్కువ కదరా, పాపం వుత్తరాలు రాయలేని వాళ్ళూ, చదవలేనివాళ్ళూ నా దగ్గర కొస్తారు. వాళ్ళకి చేతనయిన సహాయం చేస్తాను. వాళ్ళకి తోచింది వాళ్ళిస్తారు నా రోజు గడిచిపోతుంది. మేష్టర్ని




కదురా రిటైరయేక వచ్చేదేముంది, లేక పోతే సర్వీసులో వున్నప్పుడు ఆ వచ్చిన సంపాదనలో నే మిగల్చగలిగిందేం ఉంటుందిరా !"

"మరి వాసు.. "

"వాడు పెద్దవాడయేడు కదురా !"

"అదికాదు మాష్టారూ! మీరు వాడి దగ్గరే వుండొచ్చును కదా ?"

"ఒరేయి సాయిబూ మీ నాన్న జట్కా తోలేవాడు, అవునా ?"

"అవును !"

"గుర్రం ముసల్దయితే ఏంచేసే వాడ్రా ?"

"అమ్మేశేవాడు."

"గుర్రంకాబట్టి అమ్మేవాడు, ఇంకెవ రయినా కొనేవారు. నేను మనిషిన్రా అంచేత వాడమ్మలేడు, ఎవరూ కొనలేరు కూడాను."

"మాష్టారూ !" హృదయం చీల్చుకు వచ్చిన ఆవేదనతో వచ్చిందా పిలుపు.

"సాయిబూ ! అందుకే నే చెప్పలేదు ఎక్కడుంటున్నానో. తెల్సిందిరా ! నీ కెప్పుడు నన్ను చూడాలనిపించితే అప్పుడే వస్తాన్రా ! బాధపడకురా" అంటూ అక్తర్‌ని దగ్గరగా తీసుకున్నాడు.

"మరి వుండడం ?"

"లేడీడాక్టర్ సుజాతంటారు విన్నావా? ఆవిడ ఇంట్లో వుంటున్నాను. చాలా సుఖంగా గడిచిపోతున్నదిరా."

"వస్తానమ్మా !" అంటూ గుమ్మం దాకా నడిచి "అరె, నా చిన్నసాయిబు సంగతి మర్చేపోయేనే" అంటూ కోటు లోపలి జేబులోంచి నాలుగు పావలా కాసులు తీసి "ఒరేయి చిన్నసాయిబూ ఏవన్నా కొనుక్కోరా నాన్నా !" అంటూ

వాడి చిన్నగుప్పిట విప్పి అందులో పెట్టేడు.

"ఏమిటి మేష్టారూ ఇది?" అన్నాడు అక్తర్.

"దీంతోటేమీ రాదురా సాయిబూ! కాని అంతకంటే తాహతులేనివాడిని కాని మొట్టమొదటిసారి చంటిబిడ్డని చూశేక వుట్టిచేతుల్తోటి ఎలా వెళ్ళనురా!" అంటూ గుమ్మం దిగేరు. జరీనా కళ్ళల్లో నీళ్లు నిండుకున్నాయీ సంఘటనకి.

"ఒరేయి నువ్వు మీ షాపుకి వెళ్ళరా, నేనూ నా ఆఫీసుకి వెళతాను" అన్నారు చిన్నగా నవ్వుతూ ఆచారిగారు. ఆ నవ్వులో ఎంతో జీవం కనిపించింది అక్తర్‌కి.

"ఆదివారం నా షాపుకి శలవు మేష్టారూ! నేను వస్తాను మీ దగ్గరకి, వుంటారు కదా!" అన్నాడు.

"పోస్టాఫీసుకి శలవయితే ఇంట్లో వుంటాను, లేకపోతే పోస్టాఫీసులో వుంటాను." అన్నారు.

రిక్షా ఒకటి పిలిచేడు అక్తర్.

"రిక్షా ఎందుకురా మెల్లిగా నడిచి వెళ్ళిపోతాను." అన్నారు.

"ఫరవాలేదు మాష్టారూ!" అంటూ వాడెలా వెళ్ళవల్సిందీ చెప్పి డబ్బులు కూడా తనే ఇచ్చేడు.

"నా దగ్గర డబ్బుందిరా!" అన్నాడు ఆచారిగారు.

"మీ దగ్గర లేదని ఇవ్వడం లేదు మాష్టారూ. జాగ్రత్తగా ఎక్కండి," అంటూ ఆయనకి ఎక్కడానికి సహాయం చేశేడు. "మెల్లిగా తీసుకువెళ్లవోయ్! మరి వుంటాను మేష్టారూ." నమస్కారం చేస్తూ అన్నాడు. చెయ్యెత్తుతూ మనస్సులోనే దీవించేరు ఆయన సాయిబుని.

ఆనందం వెల్లివిరిసిన అక్తర్ మనస్సులో ఏదో తెలియని ఆవేదన కూడా లీలగా మెర్సింది. మౌనంగా షాపువేపు వెళ్ళిపోయేడు.

* * *

ఆ రోజు ఆదివారం

అక్తర్ రిక్షా దిగి ఇంటివేపోసారి చూసేడు.గేటుతీసుకుని లోపలికివెళ్ళేడు. అంతా నిశ్శబ్దంగా వుంది. తలుపు దగ్గరున్న కాలింగ్‌బెల్ కొట్టేడు.

లోపలనుంచి సుజాత వచ్చింది. "ఎవరు కావాలి?" అంది తలుపుతీస్తూనే.

"ఆచారి మేష్టారు ఇక్కడుంటున్నారని చెప్పేరు. ఆయనని చూడ్డానికి వచ్చేను." అన్నాడు అక్తర్.

"లోపలికి రండి" అంటూ హాల్లోకి దారితీసింది. కుర్చీ చూపించింది. అక్తర్ కూర్చున్నాడు. ఆమెకూడా అతని కెదురుగా ఓ కుర్చీలో కూర్చుని "మీకు మేష్టారేమవతారు?" అంది.

"ఆయనకి నే నేంకానండి. ఆయన దగ్గర చిన్నప్పుడు చదువుకున్నాను. ఇక్కడ మెయిన్‌రోడ్డులోవున్న 'కరీమ్' కళ్ళజోళ్ళషాపు నాదే. మొన్ననే

తెల్సింది మేష్టారుకూడా ఈ వూర్లోనే వుంటున్నట్టు."

"అలాగా! పాపం మొన్న సాయం కాలం ఆయన ఇంటికి వస్తూవుంటే రిక్షా గుద్దుకుని పడిపోయేరు. కాలు ఫ్రాక్చరయింది.

అక్తర్ అదిరిపడ్డాడా వార్తకి. "ఆయన ఎక్కడున్నారిప్పుడు?" అన్నాడాతృతగా.

"నా నర్సింగ్‌హోమ్‌లోనే వున్నాడు. ఆయనకేం ఫరవాలేదు. కాని కొంత కాలం బెడ్‌మీదుండాలి. లేచి నడవడానికి వీలులేదు."

"మరి భోజనం అవీ...." అనడిగేడు అక్తర్.

"నేనేపంపిస్తున్నాను. మంచి మనిషి. ఆత్మాభిమానం వున్న మనిషి. ఏ సహాయం చేస్తానన్నా ఒప్పుకోరు. ఇంతింట్లో నే ఒక్కర్తినే వుంటున్నాను. మేష్టారూ నాతోటి వుండండి అంటే 'కాలూ, చెయ్యీ ఆడినన్నాళ్ళూ ఆ కారు షెడ్‌లోనే వుంటానంటారు.' ఆయనకి ఎక్కడ సుఖంగా వుంటే అక్కడే వుండమన్నాను.

"ఆయన వుంటున్న ఎడ్రసు చెప్పడానికి ఒప్పుకోలేదు కాని అతి బలవంతం మీద మీ దగ్గర వుంటున్నట్టు చెప్పేరు. కాని ఆయన పోస్టాఫీసు దగ్గర వుత్తరాలూ అవీ రాస్తూ డబ్బు సంపాదిస్తున్నానన్నారు. అది నాకు చాలా బాధ కలిగించిందండి. ఆయన ఈ వయస్సులో ఇలా కష్టపడడం నా కెంతమాత్రం ఇష్టంగా లేదండి. అందుకే మా యింటకి తీసుకు వెళదామని వచ్చేను" అన్నాడు అక్తర్. అప్పుడు అతని గొంతులో పలికినబాధతో అతన్ని అంచనావెయ్యగలిగింది సుజాత.

"మీ పేరు?"

"అక్తర్!"

"ఆయన కెవరూ లేరా?"

"వాసు అని ఒకకొడుకున్నాడు. వైజాగులో వుంటున్నాడని చెప్పేరు. వాడు ఈయన్ని సరిగ్గా చూసివుండడు అందుకే ఈయన ఇక్కడ కొచ్చేసుంటారు. అసలు మాష్టారు మీ కెలా తెల్సు?" అనడిగాడు అక్తర్.

"ఓ ఏడాదిక్రితం కళ్ళజోడు గురించి డాక్టర్ సుందర్ దగ్గరకి వచ్చేరు. 'ప్రిస్క్రిప్షన్' తీసుకుని 'ఎంతవుతుంది బాబూ! ఈ కళ్ళజోడు' అనడిగేరు. ఆ టయిముకి నేనక్కడే వున్నాను. నలభై రూపాయలు అవుతుందన్నారు సుందర్‌గారు.

"ఇప్పుడు వాడుతున్న అద్దాలు మరి కొంత కాలం వాడుకుంటే...."

"మీ పవరు పూర్తిగా మారిపోయింది ఇప్పటికే. మీరు చాలా అశ్రద్ధ చేశారు. ఇలా ఇంకొన్నిరోజులుంటే కళ్ళుపోయే ప్రమాదం కూడావుంది. అందేత వెంటనే కొత్తవి కొనుక్కోవల్సిందే" అన్నారు సుందర్‌గారు.

"నలభై రూపాయలు "
"మీరేం చేస్తూవుంటారు ?"
"నేను స్కూలు టీచర్‌గా రిటైరయిపోయేను బాబూ ! ప్రస్తుతం గుడిపక్క పోస్టాఫీసులో కావల్సిన వారికి వుత్తరాలు అవీ రాస్తూ వుంటాను," అన్నారు.

ఇంతలో డాక్టర్ని ఎవరో పిలిస్తే బయటకి వెళ్ళారు.

"ఎన్నాళ్ళ లోపుని కొనుక్కోవాలి బాబూ ?" అన్నారు మేష్టారు. డాక్టరుగారు లేచి వెళ్ళడం ఆయన చూడలేదు, కారణం ఆయన అప్పుడు కళ్ళజోడు పెట్టుకోలేదు.

నాకు చాలా బాధనిపించింది. "డాక్టరుగారు లేరండీ !" అన్నాను.

"అలాగా అమ్మా కనిపించలేదు" అన్నారు చేతిలోని పాత కళ్ళజోడు పెట్టుకుంటూ.

"వీటున్నంత వేగిరం కొనక్కోవాలి! ఇప్పటికే మీ పవరు మారిపోయిందన్నారుగా డాక్టరుగారు" అన్నాను.

"అలాగే నమ్మా. ఈ వయస్సులో ఏమున్నా లేకపోయినా చూపు లేకపోతే కష్టం తల్లీ ! ఎందర్ని బాధ పెట్టవల్సి వస్తుందో" అంటూ వెళ్ళిపోయేరు.


"తర్వాత తెల్సింది మా డ్రైవర్ సుబ్బయ్య తాతకి ఆయన వుత్తరాలు రాసిపెడుతూ వుంటారని. ఓ రోజు మా సుబ్బయ్యతో కల్సి మా ఇంటికి వచ్చేరు. వాళ్ళిద్దరూ గారేజి దగ్గర కూర్చుని మాట్లాడుతూవుంటే నేనే పిల్చి అడిగేను "కళ్ళజోడు కొనుక్కున్నారా ?" అని.

"అవునమ్మా కొత్త అద్దాలు పాత ఫ్రేము లోనే వేయించుకున్నాను. కొంచెం చవకలో అయింది. అదేనా ఇదిగో ఈ సుబ్బయ్య చలవవల్లే" అన్నారు.

"ఆమాటంటూవుంటేఎంతోకృతజ్ఞతాభావం తొణికిసలాడింది సుబ్బయ్యమీద ఆయనకి.

"పోనెండి ఆచార్లుగారూ నా దగ్గర వూరికే తీసుకున్నారేంటి ? వారానికి అర్ధరూపాయచొప్పున జమచేసేస్తున్నారుగా" అన్నారు సుబ్బయ్య.

"వాళ్ళిద్దరి సంభాషణా నాకు కనువిప్పు కలిగించింది. సుబ్బయ్యతాత నన్ను చిన్నప్పటినుంచి ఎత్తుకు పెంచేడు. అతని ఆదాయం ఎప్పుడేనా నన్నడిగి తీసుకునే అయిదూ, పది రూపాయలు. నెల మొత్తంలో ఒకటి రెండుసార్లు అడిగి తీసుకుంటాడు. కారణం అతనికి వున్న ఒక్కగానొక్క కొడుకు ఆర్మీలో ఎక్కడో వుంటున్నాడు. నెలకో వుత్తరం మట్టుకు రాస్తాడు. తాతకేం అలవాట్లు లేవు. 'నా ప్రాణం నీ చేతుల మీదుగానే వెళ్ళిపోవాలి తల్లీ' అంటూ వుంటాడు. జీతంరాగానే నెలనెలా అతని పేర బేంకులో వేస్తూవుంటాను. కాని నా కెందుకంటాడు తాత. అటువంటిది సుబ్బయ్య తాత చూపించిన మాన



వత్వంలో నేను ఏమాత్రం చూపించలేకపోయేనే అని బాధపడ్డాను. నాలుగు రోజుల తర్వాత గుడికి వెళ్ళినప్పుడు చూస్తే పాపం ఆయన జ్వరంతో పడుకుని వున్నారు. ఆయన గురించి పూజారి గారి నడిగేం. చాలా వుత్తముడమ్మా ఆయనకే కష్టాలు. రెండు రోజులబట్టి జ్వరం వస్తున్నది. నే నేంచెయ్యలేని అశక్తుడిని తల్లీ!" అంటూ వాపోయేడాయన.

"సుబ్బయ్య తాతా! పోనీ ఆయన్ని మనింటికి తీసుకువెళదాం పద. ఎలాగా రెండో షెడ్ ఖాళీగా వుంది అందులో వుంటారు" అన్నాను.

ఆ మాటకి సుబ్బయ్యతాత సంతోషానికి అవధులులేవు. ఆ జ్వరం టైఫాయిడు కావడంతో బాగా దెబ్బతిన్నాడు. తిరిగి నెలరోజులదాకా మనిషికాలేదు. నే చూడ్డానికి వెళ్ళినప్పుడు, మందులు ఇచ్చినప్పుడు ఆయన పడేబాధ నే నూహించుకోలేను బాబూ! ఆత్మాభిమానం మనిషికి ఒక్కొక్కప్పుడు శాపంగా ఎందుకు మారుతుంది? అంత ఆత్మాభిమానం వున్న వ్యక్తికి అన్ని కష్టాలెందుకు అనిపిస్తూంటుంది."

సుజాత చెక్కిళ్ళమీంచి కన్నీరు జారింది. "ఏదో అనుబంధం మా ఇద్దరి మధ్య ఏర్పడింది.

"మేష్టారూ!" అని పిలిస్తే "నన్నలాగే పిలువమ్మా! నా జీవితంలో ముప్ఫయి సంవత్సరాల పంతులుగిరీలో అలవాటయిన పేరది. నాకూ దానికీ ఏదో

అవినాభావ సంబంధం వుంది. నే రిటైరయిన్నాడు ఇంక నన్నెవరు మేష్టారూ అని పిలుస్తారని వాపోతే మీమా ఏమంది మిమ్మల్ని నే పిలుస్తాన్లెండి మేష్టారూ అని ఎవరు పిలువకపోయినా కూడా అని పాపం అలాగే పిల్చింది, పిచ్చిది. కాని భగవంతుడు కూడా రిటైరయిన వీడు పెళ్ళాన్నేం పోషించగలడని దాన్ని తీసుకుపోయేడ. పోన్లే అమ్మా అది సుఖపడింది. లేకపోతే ఈ సంపాదనలో దాన్నేం సుఖపెట్టగలిగి ఉండేవాడిని" అనేవారు.

"ఇంట్లోనే వుండండి అంటే వినరు. నాకూ సుబ్బయ్యకీ ఏదో పూర్వజన్మ సంబంధం వుందమ్మా అక్కడే వుండనీ మా ఇద్దర్నీ అంటారు.

"పోనీ పోస్టాఫీసుకి వెళ్ళకండి అ పనేదో నాకు చేసిపెట్టండి అంటే నీకే వమ్మా చదువుతున్నదానివి నేను డబ్బు మీద ఆశకొద్దీ వెళ్ళడంలేదు తల్లీ! చదువురాని వాళ్ళకి సహాయపడదామని వెళుతున్నాను అంటారు. అందులో ఆయనకేదో తృప్తి, ఆనందం వున్నాయి.

"సుబ్బయ్య తాతకి వుత్తరం వచ్చిన నాడు చూడు వాళ్ళిద్దరి ఆనందం, ఆతృత. ఆ వుత్తరం ఓ రోజు చదువుతా రిద్దరూ కూర్చుని. దానికి జవాబు రాయడానికి ఓ వారం రోజులు పడుతుంది. నాకూ మంచి కాలక్షేపమే."

ఈ మాటన్నీ వింటున్న అక్తర్ కళ్ళల్లో నీళ్ళు కదిలేయి.

అంతవరకూ మాట్లాడుతున్న సుజాత అది గమనించి "ఏం భయంలేదు బాబూ మేష్టారుకి." అంది

"అది కాదమ్మా! ఏవో గతాలు జ్ఞాపకాని కొచ్చేయి. మనసు కలత పడింది.

"మా నాన్న జట్కా తోలేవాడు మా వూర్లో. మేష్టారికి, నాన్నకి మంచి స్నేహం. రోజూ జట్కా విప్పేసిన తర్వాత మేష్టారింటికెళ్ళి కూర్చునేవాడు నాన్న. ఓ సారి నాన్నకి జబ్బుచేసింది. నెలరోజులు పైగా మంచం దిగలేదు ఇల్లు గడవడం కష్టమయిపోయింది. అప్పులవాళ్ళు బండీ, గుర్రాన్ని తోలుకుపోయేరు. ఆ రోజుల్లో మేష్టారు, ఆయన భార్య అదుకున్నారు. మా నాన్న 'మీకెందుకు మేష్టారు ఈ బాధ' అంటే 'పోరా నీకెందుకు ఈ ఆలోచన మా ఆవిడ వాటాలో సగం నీకిస్తున్నది, నా వాటాలో కొంచెం మా సాయిబు కిస్తున్నాను' అనేవారు.

'మా నాన్న పోయిన్నాడు చేతిలో డబ్బులేకపోతే మేష్టారు ప్రాణపదిలంగా చూసుకుంటున్న బంగారపు కళ్ళజోడు ఫ్రేము అమ్మేసేరు. ఆ రోజింకా నేను మర్చిపోలేనమ్మా" అన్నాడు అక్తర్. జారిన కన్నీళ్ళతో తేలికపడ్డాయి ఇద్దరి మనస్సులూ. సుబ్బయ్య కారు తీసుకు

వచ్చేడు. ఇద్దరూ నర్సింగ్‌హోమ్‌కి బయలుదేరేరు.

మంచంమీదున్న మేష్టారినికి చూసే సరికి అక్తర్‌కి చాలా బాధనిపించింది.

"మేష్టారూ?" అన్నాడు బాధగా.

"ఏరా సాయిబూ బాగున్నావురా? అమ్మాయి చిన్నసాయిబూ కులాసా యేనా?" అన్నారు.

"అందరం బాగున్నాం మేష్టారూ! ఏంటిదంతా? నేను డాక్టరుగారితో మాట్లాడతాను మా ఇంటికి వెళ్ళిపోదాం" అన్నాడు బాధగా.

"నేనంటే నీ కెందుకురా అంత అభిమానం. ఇక్కడ నాకేంటి తక్కువయిందిరా ఇప్పుడు. సుజాతమ్మ, సుబ్బయ్య అన్నీ చూసుకుంటున్నారు. ఎటొచ్చీ నా బాధంతా పోష్టాఫీసుకు వెళ్ళ లేకపోయేనే అనే."

సుజాత వచ్చింది. కొంచెంసేపు మాట్లాడేక "మరి నేను వస్తాను మేష్టారూ" అంటూ లేచింది. ఆమె వెనకనే వెళ్ళాడు అక్తర్. "ఇంకా ఎన్నాళ్ళుండాలమ్మా ఆయనిక్కడ" అన్నాడు.

"చాలా రోజులుండాలి. వయస్సు పెద్దదికదా అతుక్కోవడం కష్టం."

"మీ రొప్పుకుంటే ఆయన్ని మా ఇంటికి తీసుకువెళదాంఅనుకుంటున్నాను" అన్నాడు.

"వద్దు! ఆయనకిక్కడే సౌకర్యంగానూ, రెస్టుగానూ వుంటుంది." అంటూ వెళ్ళిపోయింది సుజాత.

మరి కొంచెంసేపున్నాక బరువెక్కిన మనస్సుతో బయలుదేరేడు అక్తర్. ఇంటికి రాగానే జరీనాకి చెప్పేడు. ఆమె కూడా బాధపడింది.

మర్నాడు సాయంత్రం జరీనానికూడా తీసుకువెళ్ళాడు. ఆచారిగారు సంబరపడి పోయారు వాళ్ళని చూసి.

పదిహేనురోజులు గడిచిపోయేయి. రోజువిడిచి రోజు అక్తర్ హాస్పిటల్‌కి వెళ్ళి చూసొస్తున్నాడు. ఆరోజు అది వారం కొంచెం పెందరాడే వెళ్ళాడు.

మాటల సందర్భంలో "ఒరేయి సాయిబూ! ఒక్క వుపకారం చేస్తా వురా?" అన్నాడు

"చెప్పండి మేష్టారూ?"

"వాసుకి ఒక్క వుత్తరం రాయిరా ఎందుకో వాడిని చూడాలనిపిస్తున్నది." అన్నాడు.

"అలాగే!" అని ఆయన చెప్పిందంతా ఓపిగ్గా రాశాడు.

నాలుగు రోజుల్నాడు వాసు వచ్చాడు.

సుజాత మెల్లిగా మందలించింది అటువంటాయన్ని అలా వదలిపెట్టినందుకు.

దానికి వాసు సమాధానం "జీతం సరిపడదు. భార్య అనారోగ్యం. ఈయన 'నా కాలూ, చెయ్యీ'ఆడుతోంది. నేను కోమటికొట్లలో అక్కడ పద్దులు

రాస్తానని బయలుదేరడం ఏం బాగుంటుంది చెప్పండి?"

"తప్పేముంది కష్టపడి పనిచెయ్యడంలో. మరి ఆయనకెవరు పెద్ద వుద్యోగం ఇస్తారు, ఇచ్చినా చెయ్యగలిగిన శక్తేదీ ఆయనకి." అన్నది సుజాత.

మౌనంగా వుండిపోయాడు వాసు.

మేష్టారు మాత్రం 'నేను తీసుకువెళతాను నాన్నా' అంటాడేమోనని ఆశగా చూశారు అతనున్న రెండురోజులూను. కాని అతనా మాటనలేదు, వెళ్ళేటప్పుడో పదిరూపాయలు మంచంమీదుంచి "మీరుంచండి నాన్నా దేనికేనా పనికొస్తా"యన్నాడు.

"డబ్బు నాకెందుకురా? నీకుత్తరం రాయించింది డబ్బు గురించి కాదురా వాసూ! ఎటుంచేమయినా ఓ సారిచూస్తే ఆ కోరికకూడా వుండకుండా పోవచ్చు కదా?" అన్నాడు నీళ్ళునిండిన కళ్ళతో.

మౌనంగా వెళ్ళిపోయాడు సంచీ తీసుకుని వాసు.

సుబ్బయ్య, అక్తర్ కూడా చాలా బాధపడ్డారు అతని ప్రవర్తనకి. అదేమాట సుబ్బయ్యంటే,

"అంతే సుబ్బయ్యా! అయినవాళ్లానికి పిల్లలు అందుకొస్తారని ఆశపడ్డం మంచిదికాదు" అన్నాడు.

"ఎవరున్నా లేకపోయినా నేనున్నాను మేష్టారూ! నేనుమాత్రం మీ కొడుకులాంటి వాడిని కాదేంటి" అన్నాడు అక్తర్ బత్తాయిపండు వలుస్తూ.

"నువ్వే నా కొడుకువిరా సాయిబూ" అన్నాడు వచ్చే కన్నీటిని బలవంతంగా ఆపుకుంటూ, సాయిబు వీపుమీద చెయ్యివేసి రాస్తూ ఆచారిగారు.

* * *

"చూడండి మేష్టారూ! మీ గురించి ఏం తెచ్చానో?" అన్నాడు చేతిలోని పొట్లం విప్పుతూ.


"ఏంటిరా అది?" అన్నాడు నీరసంగా.

"మీరు మర్చిపోయినా నా గుండెల్లో నాటుకుపోయిన ఓ రోజు సంఘటన మేష్టారూ! మా నాన్న పోయిన్నాడు డబ్బులేకపోతే మీ కళ్ళజోడు బంగారపు ఫ్రేము అమ్మించి డబ్బిచ్చేరు. ఈరోజువరకూ ఏ కళ్ళజోడు ఫ్రేముచూసినా అందులో ఆ రోజు మీ కళ్ళజోడు ఫ్రేమే గుర్తుకొస్తూ వుంటుంది. ఈ రోజు నేనిలా నిలబడగలిగేనంటే అంతా మీ చలవే మాష్టారూ!"

"ఒరేయి సాయిబూ! ఎందుకురా ఆ సంఘటనలు అవీ జ్ఞప్తికితెస్తావు, గడిచిన రోజులే హాయిగా వున్నాయిరా!"

"ఇప్పుడు మీ కెదురుగా వున్న ఈ సాయిబు ఆ రోజుల్లో మీ కాఫీలోను భోజనంలోనూ సగం వాటా తిని పెరిగినవాడే మాష్టారూ!" అన్నాడు.

వారిద్దరి సంభాషణకి జరీనా కరిగిపోయింది. "మీరు తీసుకోవాలి బాబా!




"ఇన్ని రోజులబట్టి వారు పడుతున్న ఆవేదనకి అంతంవుంటుంది." అంటూ కళ్ళజోడు ఆయనకు పెట్టింది.

అంతవరకూ గుమ్మంలో నిలబడ్డ సుజాత కళ్ళుకూడా చెమర్చాయి

"సాయిబూ! ఎంతవాడివయ్యావురా నువ్వు," అంటూ కళ్ళజోడు ఫ్రేముని ఆప్యాయంగా తడిమి చూసుకున్నాడు.

అప్పటి ఆయన ముఖంలో కన్పించిన తృప్తి, ఆనందం చూసి, "మేష్టారూ మీకది కళ్ళజోడు కాదు. మనుషుల ప్రేమాభిమానాలనే అద్దాలున్న జోడది" అంది సుజాత కళ్ళజోడు సరిగ్గా సర్దుతూ.

"అమ్మా! చూడమ్మా నా సాయిబిచ్చిన అమూల్యమైన కానుక తల్లీ" అంటూ సంబరపడిపోయిన ఆచారిగారికి కన్నీరాగలేదు.

ఆ దృశ్యం చూసిన సుజాత, సుబ్బయ్య, అక్తర్, జరీనాల కళ్ళు శ్రావణ మేఘాలయ్యాయి. ఆయన చేతి ఆసరాతో ఆయన గుండెలమీద పాకిన చిన్న సాయిబుకూడా ఎందుకో తెలియకుండానే ఓ చిరునవ్వు నవ్వేశాడు.

---